
నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, ఆదివారం 22 జూన్ 2025 | VIKARABAD


## ఆరోగ్యానికి యోగా

### రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి



ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఎంతో దోహదపడుతుందని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని బాల యోగి స్టేడియంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమం, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా డే లో ఆయన పాల్గొని యోగాసనాలు వేశారు.

-రంగారెడ్డి, జూన్ 21 (నమస్తే తెలంగాణ)

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు దుర్మార్గం

### కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నది

### బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



వికారాబాద్, జూన్ 21 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ సర్కార్ కక్షపూరితంగా కేసు నమోదు చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడమేనా..? మీ పాలన అంటూ మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను తట్టుకోలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదన్నారు. ఎన్ని నిర్బంధాలు పెట్టినా, కేసులు నమోదు చేసినా, అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ తరపున ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

## పెద్దఅంబర్‌పేట- పసుమాముల రోడ్డులో మాయమైన ఆలయం

- రూ.5 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ
- నియోజకవర్గ ప్రజాప్రతినిధితోపాటు మరికొందరికి ముడుపులు అందాయని ఆరోపణలు



పెద్దఅంబర్‌పేట–పసుమాముల జడ్పీ రోడ్డులో కళానగర్ వద్ద గూగుల్‌లో కనిపిస్తున్న ఆలయం

# గుడి గుటుక్కు !

సిటీబ్యూరో, జూన్ 21 : గుడి మాయమైంది. నిర్మించిన ఆలయాన్ని గుట్టుచప్పుడు కాకుండా తొలగించారు. రూ.కోట్ల విలువైన సర్కారు స్థలం కబ్జాకు గురైంది. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన దేవాలయాన్ని తొలగించి వేరే వారికి అప్పగించే ఈ వ్యవహారంలో ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధితోపాటు కొందరు స్థానిక ప్రజాప్రతినిధులకు పెద్దఎత్తున ముడుపులు అందినట్టు ఆరోపణలున్నాయి. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పెద్దఅంబర్‌పేట–పసుమాముల జడ్పీ రోడ్డు మధ్యలో కళానగర్ ఉన్నది. అక్కడున్న ప్రాథమిక పాఠశాల పక్కన గౌడ సంఘం భవనం పక్కనే.. జిల్లా పరిషత్ రోడ్డును ఆనుకుని పసుమాముల రెవెన్యూ 386 సర్వే నంబర్‌కు సంబంధించి రూ.5 కోట్లకుపైగా విలువైన ప్రభుత్వ భూమి ఉన్నది. దీని వెనకే పట్టా భూములున్నాయి. రెండేండ్ల కిందటి వరకు పట్టా భూమి ఉన్న యజమాని రోడ్డును ఆనుకుని ఉన్న భూమిని వదిలేసి వెనక ప్రహరీ నిర్మించాడు. ఖాళీగా ప్రభుత్వ స్థలంలో కళానగర్‌వాసులు శివుడి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. అయితే, పట్టా భూమికి నేరుగా రోడ్డు కోసం యజమాని ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తున్నది. దానికి స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో తన భూమి వరకు హద్దుగా ప్రహరీ ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం. అయితే, స్థానికులంతా కలిసి రోడ్డుకు ఆనుకుని ఉన్న 386 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలోని కొంత భాగంలో ఆలయాన్ని నిర్మించగా.. మిగతా స్థలం ఖాళీగానే ఉండేది. గుడి నిర్మాణం దాదాపు పూర్తికాగా.. విగ్రహ ప్రతిష్ఠాపన ఒక్కటే మిగిలి ఉన్నది...అయితే, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఏమైందో ఏమో తెలియదు కానీ, ఏడాదిన్నరలోనే ఆ ఆలయం కూడా మాయమైంది. గుడి ఆనవాళ్లే కనిపించడం లేదు. ఆ స్థలంలో షెడ్డు నిర్మాణం ప్రారంభమైంది.




ప్రస్తుతం పెద్దఅంబర్‌పేట- పసుమాముల జడ్పీ రోడ్డులో కళానగర్ వద్ద కనిపించని గుడి ఆనవాళ్లు.. ఆలయం స్థానంలో వెలుస్తున్న షెడ్డు

## గుడి మాయం.. కానుకలే కారణం!

కళానగర్‌లోని ప్రాథమిక పాఠశాలకు ఆనుకుని, గౌడ సంఘం భవనం ఉండగా.. దానికి ఆనుకుని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన గుడి మాయమవడం వెనుక పలువురికి పెద్దఎత్తున ముడుపులు అందినట్టు ఆరోపణలున్నాయి. గుడిని పూర్తిగా తొలగించడంతోపాటు ప్రహరీని ముందుకు కదిలించేందుకు భారీగానే కానుకలు సమర్పించుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. రోడ్డుకు ఆనుకుని 386 సర్వేనంబర్‌కు సంబంధించి ప్రభుత్వ స్థలం ఉండగా ఇప్పుడు కనిపించడం లేదు. దాదా పు రూ.5 కోట్లకుపైగా విలువైన భూమిని సొంతం చేసుకునేందుకు ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధితోపాటు స్థానికంగా ఉన్న ముగ్గురు మాజీ ప్రజాప్రతినిధులకు పెద్దఎత్తున అందినట్లు.. వారికి కానుకలు ముట్టాకే.. అక్కడి గుడి మాయమైనట్టు తెలుస్తున్నది. గుడిలో లింగం ప్రతిష్ఠాపనకు ముందే గుడితోపాటు రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి సైతం కనిపించకుండాపోయింది. అయినప్పటికీ ఏ శాఖ అధికారులూ అటువైపు కన్నెత్తి చూడటంలేద ని.. నిర్మించి ఆలయాన్ని సైతం తొలగించడం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఓ గ్రామంలో గుడి పేరుతో పక్కనున్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారిపై ఇటీవల నమస్తే తెలంగాణలో 'గుడి పేరిట బురిడీ' శీర్షికన వచ్చిన కథనంతో ఆక్రమణల పర్వానికి అడ్డుపడింది. అక్కడ గుడి పేరుతో కబ్జాకు తెరలేపితే.. ఇక్కడ ఏకంగా గుడినే మింగేసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడం గమనార్హం.



# ఎట్ల కూలుస్తరో చూస్తం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

- నిరుపేదల ఇండ్లు కూలుస్తామంటే చూస్తూ ఊరుకోం
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తాం
- షాహిన్‌నగర్ హైడ్రా బాధితులకు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి భరోసా

పహాడీషరీఫ్, జూన్ 21: నిరుపేదలు కష్టపడి కట్టుకున్న ఇండ్లలో ఒక్క గజం కూడా వదులుకునేది లేదని, వ్యవస్థల పేరుతో ఇష్టారాజ్యంగా ఇండ్లను కూలుస్తామంటే ప్రభుత్వంపై న్యాయం పోరాటం చేస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆమె నియోజకవర్గంలోని షాహిన్‌నగర్‌లో హైడ్రా బాధితులు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై బాధితులకు భరోసా కల్పించారు. ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిన తర్వాతే కొనుగోళ్లు జరిపి ఇంటి నిర్మాణాలు చేపట్టామని, ప్రాపర్టీ ట్యాక్స్ కూడా కడుతున్నామని.. అయితే ఇప్పుడు హైడ్రా, ఇరిగేషన్ శాఖల పేరుతో ఆయా నిర్మాణాలు అక్రమంటూ కూల్చివేసేందుకు చూస్తున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. క్యూబా కాలనీలో నివసిస్తున్న వారిని ఎర్రకుంట ప్రాంతవాసులుగా గుర్తిస్తూ ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. ఇప్పుడు ఎఫ్టీఎల్ పేరుతో తమ నిర్మాణాలను అక్రమమని చెప్పి కూల్చివేసేందుకు చూస్తున్నారని.. ఈ క్రమంలోనే దాదాపు 200 ఇండ్లకు పైగా హైడ్రా అధికారులు మార్కింగ్ చేశారని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు.

### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తాం..

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ..నిరుపేదల స్థలాలు, ఇండ్ల విషయంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. మార్కింగ్ వేసినంత మాత్రాన ప్రజలు భయపడవద్దని, అవసరమైతే శాసనసభలో ఈ విషయాన్ని చర్చిస్తామని తెలిపారు. స్థానికుల్లో చాలా మంది ప్రభుత్వం నుంచి ఎన్‌వోసీ, ఎల్ఆర్ఎస్ అనుమతులు పొంది ఇండ్ల నిర్మాణం చేసుకున్నారని తెలిపారు. నిర్బంధ నోటీసులు జారీ చేయాలని చూస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. నగరం చుట్టూ ఉన్న చెరువుల్లోని ఎఫ్టీఎల్ పరిధిల్లో అనేక వెంచర్లు కొనసాగుతున్నా పట్టించుకోని అధికారులు.. దాదాపు 25 ఏండ్ల కిందట ఇండ్ల నిర్మాణాలు చేసుకున్న వారికి నోటీసులు జారీ చేయడం వింతగా ఉందని ఎద్దేవా చేశారు.

### న్యాయం చేయాలి

రెవెన్యూ, మున్సిపల్ శాఖల అనుమతులతోనే పదేండ్ల కిం దట స్థలం కొని ఇంటిని నిర్మించా. ప్రభుత్వానికి మున్సిపల్ ట్యాక్స్, విద్యుత్తు, వాటర్ బిల్లులను చెల్లిస్తున్నా. అయినా ఇప్పుడు వచ్చి చెరువు శిఖం భూమి అంటూ నోటీసులు జారీ చేశారు. పేదలను కావాలనే అధికారులు వేధిస్తున్నారు. మాకు న్యాయం చేయాలి.

- సఫియా ఫాతిమా, క్యూబాకాలనీ

### అధికారులపై చర్యలు తీసుకోవాలి

కష్టపడి సంపాదించిన సొమ్ముతో కట్టుకున్న ఇండ్లను కూలుస్తామంటే ఎక్కడికి వెళ్లాలి. 25 ఏండ్ల తర్వాత అధికారులు వచ్చి నోటీసులు ఇవ్వడం ఏమిటీ..? ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నప్పుడు వెంచర్లు, స్థలాలకు అనుమతులు ఇవ్వడం అధికారుల తప్పిదమే. నిర్మాణాలకు అనుమతులు జారీచేసిన అధికారులపైనే చర్యలు తీసుకోవాలి.

- బదర్‌భాయ్, క్యూబాకాలనీ

## పంటలు చూసైనా..రైతు భరోసా ఇవ్వండి

- రియల్ బూచి చూపించి.. ఎగ్గొట్టే ప్రయత్నం చేయొద్దు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై ధ్వజం
- క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

బడంగ్‌పేట, జూన్ 21: మహేశ్వరం మండలంలో పంటలు చూసైనా..రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రియల్ బూచి చూపించి.. ఎగ్గొట్టే ప్రయ త్నం చేయొద్దని హితవు పలికా రు. శనివారం మహేశ్వరం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో ఉన్న రైతులు యాదమ్మ, జంగయ్య, బాల్‌రాజ్ వేసిన వరి, చిక్కుడు పంటలను ఆమె బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న 19 మండలాల్లో రైతు భరోసాను నిలిపివేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉందని, రైతులు వ్యవసాయం చేయడం లేదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో దాదాపుగా రెండు లక్షల ఎకరాల కు సంబంధించిన రైతులకు పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లాలో నిజంగా రైతులు వ్యవసాయం చేస్తున్నారో.. లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా కేబినెట్ తీర్మానం చేయ డం ఏమిటని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా రైతులపై ముఖ్యమంత్రి కక్ష గట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి చూపించేందుకే రైతులు వేసిన పంటల వద్దకు వచ్చినట్లు ఆమె వివరించారు. అధికారంలోకి వచ్చేందుకు రేవంత్‌రెడ్డి ఎన్నో అలవి కాని హామీలిచ్చి మోసం చేస్తున్నారని.. అంతేకాకుండా రైతు భరోసాను కూడా ఇవ్వడం లేదన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా తమకు ఇప్పటికీ రైతుభరోసా రాలేదని రైతులు బాలరాజ్, జంగయ్య, యాదమ్మ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో సమయానికి రైతుబంధు తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు గుర్తు చేశారు. రైతులను కలిసిన తర్వాత ఎమ్మెల్యే మన్సన్‌పల్లిలోని రోడ్డును పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాండు యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అందని కిట్లు అధ్వానంగా ఆటస్థలాలు..

## తెలంగాణ క్రీడా ప్రాంగణాలను పట్టించుకోని రేవంత్ సర్కార్

- పంచాయతీల్లోనే మూలుగుతున్న కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు
- పిచ్చి మొక్కలు, తాగుబోతులకు అడ్డాగా మారిన మైదానాలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వంలో ప్రతి గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు
- రంగారెడ్డి జిల్లాలో 547 మైదానాలు
- క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలంటున్న క్రీడాకారులు

షాబాద్, జూన్ 21 : గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికో క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. అందులో ఆడుకునేందుకు వీలుగా స్పోర్ట్స్ కిట్లనూ అందజేసింది. ఈ విధంగా జిల్లాలో 547 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయగా..యువత ఆటలాడి తర్ఫీదు పొందారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను పట్టించుకోకపోవడంతో అవి వృథాగా కనిపిస్తున్నాయి. స్పోర్ట్స్ కిట్లను బయటికి తీసి ఆడిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో స్పోర్ట్స్ కిట్లు గ్రామ పంచాయతీలకే పరిమితం కాగా.. మైదానాల్లో గడ్డి మొలిచి పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల పశువులు సంచరిస్తుండగా.. మరికొన్ని క్రీడాప్రాంగణాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. దీంతో క్రీడాకారులకు ఇబ్బందులు తప్పడం లేదు.




శంకర్‌పల్లి మండలంలోని కొత్తపల్లిలో పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా మారిన క్రీడాప్రాంగణం



### వినియోగంలోకి తీసుకురావాలి

క్రీడాప్రాంగణాలు వినియోగంలో లేకపోవడంతో పిచ్చిమొక్కలు, గడ్డితో దర్శనమిస్తున్నాయి. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం అన్ని గ్రామాల్లో మైదానాలను ఏర్పాటు చేసి కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లనూ అందించింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం క్రీడాకారులను విస్మరిస్తుండడంతో స్పోర్ట్స్ కిట్లన్నీ పంచాయతీలకే పరిమితమవుతున్నాయి. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి క్రీడాప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి. -ఇమ్రాన్, క్రీడాకారుడు, షాబాద్

## కొరవడిన నిర్వహణ.. మొలిచిన పిచ్చి మొక్కలు

జిల్లాలోని చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలోని 21 మండలాల్లోని 526 గ్రామ పంచాయతీల్లో పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఊరికో క్రీడా ప్రాంగణం చొప్పున 547 తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఒక్కో గ్రామ పంచాయతీలో 20 గుంటల చొప్పున భూమిని కూడా కేటాయించింది. దాదాపుగా రూ.2,50,000 వరకు ఖర్చు చేశారు. చాలా గ్రామాల్లో స్థలాల కొరత ఉండడంతో పాఠశాల ప్రాంగణాలు, ఖాళీగా ఉన్న కొద్దిపాటి స్థలాలు, వైకుంఠధామాలు, గ్రామ పంచాయతీల పక్కన తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరిట బోర్డు, వాలీబాల్ కోర్టు, వ్యాయామం చేసేందుకు పరికరాలను ఏర్పాటు చేశారు. కానీ, ప్రస్తుతం వాటి నిర్వహణ కొరవడడం తో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. మరోవైపు నిధుల కొరతతో పంచాయతీలు వాటి నిర్వహణను గాలికొదిలేశాయి.

### ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు..



గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అన్ని గ్రామాల్లోనూ క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసి.. అవసరమైన ఆట వస్తువులను అందజేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదు. చాలా గ్రామాల్లో పిచ్చిమొక్కలతో క్రీడా ప్రాంగణాలన్నీ అధ్వానంగా మారాయి. ప్రభుత్వం స్పందించి క్రీడాప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాలి.

-గంగిడి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత, హైతాబాద్, షాబాద్



సంకెపల్లిలోని క్రీడాప్రాంగణంలో బీరు బాటిళ్లు వేసిన మందుబాబులు



### పంచాయతీల్లో మూలుగుతున్న కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు

గత ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామానికొక క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేయడంతోపాటు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లనూ అందజేసింది. అందులో టీషర్టులు, క్రికెట్, వాలీబాల్ కిట్లు, మేజరింగ్ టేబుల్, డంబుల్స్, డిస్కస్ త్రోలు, టెన్నీకాయిట్ రింగులు, స్కిప్పింగ్ రోప్‌లు, విజిల్స్ తదితర వస్తువులున్నాయి. అయితే, చాలా చోట్ల వినియోగంలో లేక పంచాయతీ గదుల్లో మూలన పడేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు గ్రామీణ క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.